క్లుప్తంగా

దాతకు సన్మానం



దాతను సన్మానిస్తున్న సీఐ సంగమేశ్వరరావు

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణానికి నగదు విరాళం అందజేసిన రాచపూటి రామలింగయ్యతో పాటు ఆయన కుమార్తెను సీఐ సంగమేశ్వరరావు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వాహకులు వారి గోత్రనామాలపై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సంగమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మనుబోలు : మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద కండలేరు ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయంలో స్వామివారికి ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 14వ తేదీన స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్వామి దంపతులకు 16 రోజుల పండగను పురస్కరించుకుని అర్చకుడు ఫణీంద్రశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా దండు చంద్రశేఖర్‌రెడ్డి–రాజేశ్వరమ్మ దంపతులు వ్యవహరించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

ఓంకారరాజుకు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం : ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ లీగల్ అడ్వైజర్‌గా ఎన్నికైన నెల్లూరుకు చెందిన వైవీ ఓంకార రాజును బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన అసోసియేషన్ అధ్యక్షుడు గంటా నరసింహులు ఆదివారం అభినందించారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషనర్ కార్యాలయంలో కలిసిన ఆయన నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఓంకారరాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకయ్య, శీనయ్య, డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడులు

నెల్లూరు సిటీ: పేకాట కేంద్రంపై పోలీసులు దాడులు చేశారు. వివరాలు.. రాజేంద్రనగర్‌లోని ఓ ఇంట్లో పేకాటాడుతున్నారనే సమాచారం నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి అందింది. ఈ క్రమంలో ఆయన ఆదేశాలతో ఐడీ పార్టీ సిబ్బంది సాగర్, మణి, సంతపేట పోలీసులు దాడులు చేశారు. పేకాటాడుతున్న పది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.12100ను స్వాధీనం చేసుకున్నారు.

జెడ్పీ వాకర్స్‌కు సన్మానం

నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పలువుర్ని జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. నిండు నూరేళ్ల వర్ధిల్లు కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్లో జన్మించిన వారిని సన్మానించారు. అనంతరం పేద మహిళ గౌసున్నీసాకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నేతలు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, కృష్ణయ్య, అనంతరావు, ఎస్తేరురాణి, ఖాసిం, రత్నయ్య, రాజగోపాల్, వెంకటేశ్వర్లు, శరబయ్య, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న వాహనం

నెల్లూరు సిటీ: డివైడర్‌ను ఐషర్ వాహనం ఢీకొన్న ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మినీబైపాస్‌లోని ఓ షోరూమ్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులను అన్‌లోడ్ చేసి తిరిగి విజయవాడ వెళ్లేందుకు గానూ వాహనాన్ని డ్రైవర్ తీశారు. అప్పటికే పూటుగా మద్యం సేవించారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ వద్ద డివైడర్‌ను వేగంగా ఢీకొన్నారు. ప్రమాదంలో కార్పొరేషన్‌కు సంబంధించిన స్తంభాలు, సెంట్రల్ లైటింగ్ దెబ్బతినింది. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మన్ కీ బాత్' వీక్షణ



నెల్లూరు(మినీబైపాస్): ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను వీక్షించేందుకు వీలుగా ట్రంక్‌రోడ్డులోని శివాజీ సెంటర్‌లో భారీ స్క్రీన్‌ను బీజేపీ నేతలు ఏర్పాటు చేశారు. పార్టీ నేతలు సురేంద్రరెడ్డి, మిడతల రమేష్, రమణయ్య, సుబ్రహ్మణ్యం, కృష్ణ, సూర్యప్రకాష్, భాస్కర్ పాల్గొన్నారు.

- వేదాయపాళెంలోని దుర్గా నర్సింగ్ హోమ్‌లో కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ పారాయణం

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక వేడుకల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం చండీ పారాయణం కార్యక్రమాన్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక హోమాలను నిర్వహించారు. అనంతరం చండీ పారాయణం కార్యక్రమాన్ని జరిపించారు. దీంతో పాటు లఘుపూర్ణాహుతి, విద్యాహోమం, లలిత సహస్రనామార్చాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, కొలన్ రాజారెడ్డి, పూజిత వ్యహరించగా, ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, విజయమ్మ, పద్మ, కామేశ్వరి, విమల, శశిశేఖర్‌శర్మ, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

నేడు విజయేంద్ర సరస్వతి రాక

ఆలయంలో జరిగే మహా కుంభాభిషేక వేడుకలకు కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి సోమవారం రానున్నట్లు ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. మూడు రోజుల పాటు ఉండి కుంభాభిషేక వేడుకలను నిర్వహిస్తారని తెలియజేశారు.



చండీ పారాయణాన్ని జరిపిస్తున్న అర్చకులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఉభయకర్తలకు తీర్థం అందిస్తున్న అర్చకుడు

చిత్రలేఖన, కవితల పుస్తకాల పంపిణీ

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో విద్యార్థులకు చిత్రలేఖనం, కవితల పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి కోరారు. తొలుత ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు జరిపారు. అనంతరం ఆశ్రమ ఆవరణలో గాంధీజీ విగ్రహానికి, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వరప్రసాద్, సిద్ధారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గణేశం సుమంత్‌రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఆశ్రమ సభ్యులు

శ్రీశ్రీ సాహిత్యం అజరామరం

ముత్తుకూరు : మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) సాహిత్యం అజరామరమని ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చెంచురామయ్య అన్నారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆదివారం ఉపాధ్యాయులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అభ్యుదయ కవిత్వాన్ని శ్రీశ్రీ కొత్త పుంతలు తొక్కించినట్లు తెలిపారు. తెలుగు సాహిత్యంలో వేమన, గురజాడ తర్వాత సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వచన కవిత్వానికి కొత్త ఒరవడి తీర్చిదిద్ది, సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా కవిత్వాన్ని రాశారని కొనియాడారు.



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న టీచర్లు

పంటపాళెంలో ఉచిత వైద్యశిబిరం

ముత్తుకూరు : మండలంలోని పంటపాళెం పంచాయతీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 200 మందికిపైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దివంగత చదలవాడ రాధయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు ప్రారంభించారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ చదలవాడ వెంకట సునీల్‌బాబు, గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ చదలవాడ హిమబిందు వారి వైద్య బృందం రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన శిబిరానికి పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు తరలివచ్చారు. ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌లో 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కోలాహలంగా జరిగింది. అప్పటి హెచ్‌ఎం కె.కొండయ్య, ఉపాధ్యాయులు మాధవీలత, విజయలక్ష్మి, రామకృష్ణ, ప్రసాద్, మధుసూదన్, మల్లి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 22 సంవత్సరాల తర్వాత కలుసుకున్న సుమారు 60 మంది సరదాగా గడిపారు. అప్పటి సంఘటనలు, అనుభవాలను గుర్తు చేసుకుని పొంగిపోయారు. తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని పులకించిపోయారు. నాటి విద్యార్థులు నలుబోలు చెంగయ్య, సన్నారెడ్డి సుమన, ఆరెద్దుల మనోహర్, నడవడి రమేష్, సురేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



బ్రహ్మదేవిలో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోడూరు తీరంలో కోలాహలం



సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ఓ వైపు వేసవి సెలవులు, మరో వైపు మండుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు ఉపశమనం కోసం చల్లని ప్రదేశాలకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విలాసిల్లుతున్న కోడూరు బీచ్‌ను సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆదివారం జిల్లా నలువైపుల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన సందర్శకులతో కోడూరు సాగరతీరంలో సందడి నెలకొంది.

– తోటపల్లిగూడూరు

నేడు మొగళ్లూరులో 'గడప గడపకు..'

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామంలో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ నగేష్ కుమారి ఆదివారం తెలిపారు. మంగళవారం సాయంత్రం కూడా పర్యటన ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొనాల్సిందిగా సూచించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

బుచ్చిరెడ్డిపాళెం : వేసవి సెలవుల్లో ప్రైవేటు విద్యాసంస్థలు ప్రత్యేక కోచింగ్‌ల పేరుతో తరగతులు నిర్వహించరాదని ఎస్‌ఎఫ్‌ఐ మండలాధ్యక్షుడు షానవాజ్ అన్నారు. ఈ మేరకు వారు ఆదివారం విలేకరుతో మాట్లాడారు. మండలంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలు సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

పరిశుభ్ర గ్రామంగా ఎన్టీఆర్ కాలనీ

- ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి సుబ్రహ్మణ్యం



ఎన్టీఆర్ కాలనీలో మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కొడవలూరు : కొడవలూరులోని ఎన్టీఆర్ కాలనీలో వారం రోజులపాటు ప్రత్యేక శిబిరం నిర్వహించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా మార్చినట్లు వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి టి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కళాశాల దత్తత గ్రామమైన ఎన్టీఆర్ ఎస్సీ, ఎస్టీ కాలనీలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో గత సోమవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరం ఆదివారంతో ముగిసింది. 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వారం రోజుల పాటు కాలనీలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కాలనీని శుభ్ర పరచడంతో పాటు చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. రెండ్రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆఖరి రోజైన ఆదివారం కాలనీలో మొక్కలు నాటడంతో పాటు వృద్ధులు, చిన్నారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, అధ్యాపకులు ఎస్డీ మౌసినా, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు సుబ్బారావు పాల్గొన్నారు.

వేగంగా రథం నిర్మాణ పనులు



పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల రథం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను సుమారు రూ.70 లక్షలు వెచ్చించి భక్తుల సహాయ సహకారాలతో నిర్మిస్తున్నట్లు దేవస్థానం నిర్వహణ కమిటీ పేర్కొంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా రథం పనులను చేపడుతున్నారు.

హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత రాష్ట్ర చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఈదగాలిలో రెండో రోజు ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరా తీశారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూర్చడంతో ప్రజలు జగనన్న పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని తెలియజేశారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలనే ఆలోచనతో 'జగనన్నకు చెబుదాం' అనే కొత్త కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రేషన్‌కార్డు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో దేవాయలం గురించి స్థానికులు కోరడంతో టీటీడీ సహకారంతో దేవాలయ నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి కాకాణి చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, రాచాల రవికుమార్ యాదవ్, ఉప్పు భూపయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

ఇందుకూరుపేట : బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో తొలుత విశేష పూజలు జరిగాయి. అనంతరం చప్పర ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయ కర్పూర హారతులు అందజేశారు. ఉభయకర్తలుగా గుడిపోలయ్య జ్ఞాపకార్థం గుడి సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. రాత్రి శేషవాహన ఉత్సవం జరిగ్గా, పార్వతీ పరమేశ్వరుల భక్తబృందం ఉభయదాతలుగా ఉన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, ఈఓ టి.శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.



చప్పర ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కన్యకాపరమేశ్వరికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆయలంలో అమ్మవారి జయంతి మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పంచామృత అభిషేకం, 8 గంటలకు గోపూజ, 8.30కి అలంకరణ, 11 గంటలకు లలిత సహస్రనామపూజ, ఖడ్గమాల, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, 12.30కి తీర్థప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు సామూహిక మల్లెల అర్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దేవస్థానం కమిటీ చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య, సెక్రటరీ రాచపూటి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

ఎంఈఓ కార్యాలయానికి రాగిజావ గ్లాసులు

కొడవలూరు : సర్కారు బడుల్లోని విద్యార్థులకు ప్రభుత్వం కొంత కాలంగా పోషక విలువలు కలిగిన రాగిజావ అందిస్తోన్న సంగతి తెల్సిందే. ఈ జావను తాగేందుకు విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక గ్లాసులు పంపిణీ చేస్తోంది. మండలానికి తొలి విడతగా 3,939 గ్లాసులు రాగా, వీటిని ఆదివారం స్థానిక ఎంఈఓ కార్యాలయానికి చేర్చారు. మరో 600 గ్లాసులు మండలానికి చేరాల్సి ఉందని, అవి కూడా చేరాక పాఠశాలలకు చేరుస్తామని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. సోమవారం నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులందరికీ గ్లాసులు అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.



ఎంఈఓ కార్యాలయంలోకి చేర్చుతున్న సామగ్రి

ఆరోగ్యంతోనే ఆనందమయ జీవితం

మనుబోలు : ఆరోగ్యంగా ఉంటేనే ఆనందమయ జీవనం సాధ్యమని నెల్లూరు యోగా మిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా మిత్ర మండలి నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలిలో యోగా సాధన అలవర్చుకుంటే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. విచ్చలవిడి ఆహారపు అలవాట్లను మానుకోవాలని సూచించారు. మే 1 నుంచి 10వ తేదీ వరకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాయంత్రం 5 గంటలకు యోగా క్లాసులు నిర్వహిస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా మిత్ర మండలి ఉపాధ్యక్షుడు సీహెచ్ పెంచలయ్య, ఎం.రవీంద్ర, నిర్వాహకుడు రాజ, యోగా ట్రైనర్ కోటేశ్వరరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

కొడవలూరు : వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఒక్కొక్కరికి లైబ్రరీలోని పది కథల పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను వేసవి సెలవుల్లో చదవి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. చదివిన పుస్తకాలను నోటు పుస్తకంలో రాయాలని సూచించారు. సెలవుల్లో విద్యార్థులు రాసిన నోటు పుస్తకాలను, చేసిన కృత్యాలను పాఠశాలల పునఃప్రారంభం రోజున ప్రదర్శించాలని చెప్పారు. ఇచ్చిన పుస్తకాలు చదవడం పూర్తయ్యాక విద్యార్థులే ఒకరి పుస్తకాలను మరొకరికి మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ ఎస్.రవి రోజా, ఉపాధ్యాయిని బి.శ్రీశైల, సహాయకురాలు జి.మాధవి పాల్గొన్నారు.



పంపిణీ చేసిన గ్రంథాలయ పుస్తకాలతో విద్యార్థులు